క్లుప్తంగా

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

పాల్వంచ: విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని నవ లిమిటెడ్ సంస్థ జనరల్ మేనేజర్ (సీఎస్ఆర్) ఎంజీఎం. ప్రసాద్ అన్నారు. శుక్రవారం నవ లిమిటెడ్ ఆధ్వర్యంలో రోహిణి ఫౌండేషన్ సహకారంతో పట్టణంలో పాత పాల్వంచ, కొమ్ముగూడెం, కరకవాగు, నవ భారత్, కేటీపీఎస్, పాలకోయతండా ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలలో 1,040 మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ అలైఖ్య, హెచ్ఎం రాజ్యలక్ష్మీకుమారి, మాధవి, సంఘమేశ్వరరావు పాల్గొన్నారు.

ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జ్యోతి

సుజాతనగర్: కొత్తగూడెం పట్టణంలో అక్టోబర్ 21 నుంచి 23 తేదీ వరకు జరగనున్న ఐద్వా 3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.జ్యోతి అన్నారు. శుక్రవారం సుజాతనగర్ మండలం చింతలపూడి సత్యం భవనంలో సమావేశం జరిగింది. మాట్లాడుతూ... దేశంలో, రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని, మహిళలకు చట్టసభల్లో 33 రిజర్వేషన్ కల్పించాలన్నారు. ప్రతీ మహిళ చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం లాగా పోరాడాలన్నారు. తీట్ల విజయకుమార్, మద్దెల శ్రీలక్ష్మి, కుమారి, నాగరత్నమ్మ, సరిత, కల్యాణి, బానోతు పులి, బానోతు మోతి, లాలమ్మ, అచ్చమ్మ, రాధ తదితరులు ఉన్నారు.

మండలంలో డీపీఓ పర్యటన

చుంచుపల్లి: జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, కొత్తగూడెం డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటరమణ శుక్రవారం చుంచుపల్లి మండలంలోని 3 ఇంక్లైన్, రుద్రంపూర్ గ్రామ పంచాయతీల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా డివైడర్ ప్లాంటేషన్, ఇంతకు ముందు చేపట్టిన మునగ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. అనంతరం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన మానవహారం కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి కె.సత్యనారాయణ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్

ఇల్లెందురూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 30న ఇఫ్టూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సారంగపాణి పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడ్‌లు, మూడు నేరాల చట్టాల సవరణలను రద్దు చేయాలని, పంచాయతీ కార్మికులకు నెలకు రూ.26వేలు వేతనం ఇవ్వాలని తదితర కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేపట్టామని వివరించారు. తోడేటి నాగేశ్వరరావు, జటంగి వెంకన్న, కొండపల్లి శ్రీనివాస్, మోహన్‌రావు, వీరన్న పాల్గొన్నారు.

మల్లేష్ మృతికి సంతాపం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం బార్ అసోసియేషన్ సభ్యులు అంకం మల్లేష్ ఆకస్మిక మృతికి సంతాప సూచకంగా శుక్రవారం జిల్లా కోర్టు హాల్‌లో కొత్తగూడెం బార్ అసోసియేషన్ సభ్యులు సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెండు నిముషాలు మౌనం పాటించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మాట్లాడుతూ.. యుక్త వయసులో గుండెపోటు రావటం చాలా బాధాకరమన్నారు. అనంతరం లైబ్రరీ హాల్‌లో జరిగిన న్యాయవాదుల సమావేశంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ మాట్లాడుతూ... మల్లేష్ మన మధ్య లేకపోవటం బాధాకరమని, ఆయన మృతి తీరని లోటన్నారు. న్యాయమూర్తులు, పీపీలు, బార్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రయోజనం లేని పెద్దరోడ్డు

- ఇల్లెందుకు దూరంగా ఎన్‌హెచ్ బైపాస్
- అధికారుల ప్రణాళికపై ప్రజల పెదవి విరుపు
- నేడు తహసీల్‌లో ప్రజాభిప్రాయ సేకరణ



రోడ్డు విస్తరణతో విశాలంగా మారిన సుభాష్‌నగర్ రహదారి

ఇల్లెందురూరల్: రహదారులు అభివృద్ధి చెందితే.. రవాణా సౌకర్యం మెరుగుపడి వ్యాపారం, ఇతరత్రా అభివృద్ధికి బాటలు వేస్తుంది. అలాంటిది జాతీయ రహదారి వస్తుందంటే కొంత ఇబ్బందులు ఎదురైనా దీర్ఘకాలికంగా మంచిరోజులు వస్తాయని పలు త్యాగాలకు కూడా సిద్ధపడతారు. కానీ ఇల్లెందు మీదుగా తాజాగా నిర్మించనున్న జాతీయ రహదారి స్థానికంగా ఎటువంటి ప్రయోజనాలకు అవకాశం లేకుండా నియోజకవర్గ కేంద్రానికి దూరంగా వెళ్తోంది. ఈ పరిణామంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు.

తొలి ప్రతిపాదన ఇల్లెందుకు అనుకొని..

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని గౌరెల్లి నుంచి జిల్లాలోని కొత్తగూడెం వరకు 230 కిమీ మేర జాతీయ రహదారి నిర్మాణానికి ఉన్నతాధికారులు ఆరేళ్ల క్రితమే కసరత్తు ప్రారంభించారు. అప్పట్లో దీనిపై తీవ్రస్థాయిలో చర్చ జరిగింది. ఆ రోడ్డు ఇల్లెందులోకి ప్రవేశించి కొత్తబస్టాండ్, సత్యనారాయణపురం, హనుమంతులపాడు గ్రామాల సమీపం నుంచి మోదుగులగూడెం గ్రామం వద్ద ఇల్లెందు – కొత్తగూడెం ప్రధాన రహదారికి అనుసంధానం అవుతుందని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఏం జరిగిందో.. ఏమో కానీ.. అంతటితో జాతీయ రహదారిపై చర్చ ముగిసింది.

తుది ప్రతిపాదన ఇల్లెందుకు దూరంగా..

సుదీర్ఘకంగా కసరత్తు చేసిన జాతీయ రహదారి ఉన్నతాధికారులు ప్రాజెక్ట్ సమగ్ర నివేదకను 2021 ఏప్రిల్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పించారు. ఆమోదం తెలపడంతో ఒకవైపు సర్వే, మరోవైపు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఏడాది క్రితం ఇల్లెందు ప్రాంతంలో అధికారులు నిర్వహించిన సర్వే పనుల ద్వారా జాతీయ రహదారి వెళ్లే మార్గంపై స్పష్టత వచ్చింది. తుది ప్రతిపాదన మేరకు రాజీవ్‌నగర్ తండా సమీపం నుంచి కారేపల్లి మండలంలో భాగ్యనగర్ తండా సమీపం నుంచి తిరిగి ఇల్లెందు మండలం లలితాపురం గ్రామం వద్దకు జాతీయ రహదారి చేరుకుంటుంది. అక్కడి నుంచి మొట్లగూడెం గ్రామం వెనుక ప్రాంతం నుంచి మోదుగులగూడెం గ్రామం వద్ద ఇల్లెందు – కొత్తగూడెంకు ప్రస్తుతం ఉన్న ప్రధాన రహదారికి అనుసంధానం అవుతుంది. అంటే ఇల్లెందుకు సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో డైవర్షన్ తీసుకొని సుమారు పది కిలోమీటర్ల దూరంలో తిరిగి ఇల్లెందుకు మూడు కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి తిరిగి ప్రారంభమవుతోంది. దీంతో ఇల్లెందుకు ఎటువంటి ప్రయోజనం ఉండదని ప్రజలు పెదవి విరుస్తున్నారు.

వంద మీటర్ల రహదారి..

మండలంలోని సుభాష్‌నగర్ కూడలి నుంచి లలితాపురం వరకు రూ.పది కోట్ల వ్యయంతో ఆర్ అండ్‌బీ అధికారులు రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పనులు కూడా ప్రారంభమయ్యాయి. మధ్యలో డివైడర్ ఇరువైపులా 50 అడుగులు మొత్తంగా వంద అడుగులు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా సమీపంలోని గ్రామాలతోపాటు టేకులపల్లి మండల కేంద్రంలోనూ జాతీయ రహదారి వెడల్పు కూడా వంద మీటర్లుగా పేర్కొంటూ మార్కింగ్ ఇచ్చారు. అయితే జాతీయ రహదారి ఇల్లెందు మీదుగా వెళ్లినప్పుడు ఆ స్థాయి వెడల్పుతో సుభాష్‌నగర్‌లో ఆర్ అండ్‌బీ అధికారులు రహదారి వెడల్పు పనులు ఎందుకు చేపడుతున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

నేడు ప్రజాభిప్రాయ సేకరణ..

ఇల్లెందురూరల్/టేకులపల్లి: జాతీయ రహదారిలో భాగంగా భూములు, ఇళ్లు కోల్పోతున్న వారి నుంచి అభ్యంతరాలు కోరుతూ శనివారం ఇల్లెందు, టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయాల్లో జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని శుక్రవారం తహసీల్దార్లు ఒక ప్రకటనలో తెలిపారు. స్థలాలు, నివాసాలు, వ్యవసాయ భూముల వివరాలు, నష్టపరిహారంపై సమావేశంలో తెలియజేసి నిర్వాసితుల నుంచి అభిప్రాయాలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. నిర్వాసితులు ఆస్తులకు సంబంధించిన ఆధారాలు, ఆధార్ కార్డు తీసుకుని రావాలని తెలిపారు.

ప్రయోజనం స్వల్పమే..



జాతీయ రహదారి దూరంగా ఏర్పాటు చేయడం వల్ల ఇల్లెందుకు ప్రయోజనం పెద్దగా ఉండదు. గతంలో రూపొందించిన ప్రతిపాదన బాగుంది. పట్టణంతోపాటు మండలంలోనూ కొంత అభివృద్ధికి అవకాశం ఉండేది. – చీమ లక్ష్మయ్య, బాలాజీనగర్

రోడ్డు వెడల్పు తగ్గించాలి..



సుభాష్‌నగర్‌కు సమీపం నుంచే జాతీయ రహదారి నిర్మాణం ప్రారంభమవుతోంది. ఆర్అండ్‌బీ అధికారులు సుభాష్‌నగర్ నుంచి నిర్మిస్తున్న రోడ్డు వెడల్పును కొంత తగ్గిస్తే ఎక్కువ మందికి ప్రయోజనం ఉంటుంది. – చిన్నూరి సుధాకర్, సుభాష్‌నగర్

భూనిర్వాసితులకు ఉపాధి కల్పించండి..



మాట్లాడుతున్న శ్రీనివాస్

టేకులపల్లి: సింగరేణి భూనిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, సీఎస్ఆర్ నిధులు నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి మాత్రమే ఉపయోగించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రేపాకుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బోడు కొత్తగూడెం సీపీఎం శాఖ 3వ మహాసభ పూనెం రామయ్య అధ్యక్షతన జరిగింది. జెండా ఆవిష్కరించిన అనంతరం సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి సంతాపం తెలిపారు. మాట్లాడుతూ... సింగరేణి సంస్థ కోయగూడెం ఓసీ విస్తరణ కోసం గిరిజనుల భూములు తీసుకుందని వారికి ఉపాధి కల్పించాలని, నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి కేటాయించాల్సిన సీఎస్ఆర్ నిధులు పక్కదారి పడుతున్నాయని ఆరోపించారు. నిర్వాసితులకు శిక్షణ యిచ్చి ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈసం నరసింహారావు, కడుదుల వీరన్న, పూనెం రామయ్య, పూనెం సురేష్, ఈసం నాగేంద్రబాబు, ఈసం సీతమ్మ, కుంజ లక్ష్మి, ఎట్టి రవి, పూనెం జగన్నాథం, మనోజ్, సాగర్ పాల్గొన్నారు.

'ఆలయానికి అధ్యక్షుడిని నియమించ లేదు'

పాల్వంచరూరల్: మున్సిపాలిటీలోని గుడిపాడు గ్రామంలోని శ్రీ మోక్ష వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి ధర్మాదాయశాఖ ద్వారా అధ్యక్షుడిగా ఎవరినీ నియమించ లేదని పెద్దమ్మగుడి ఈఓ ఎన్.రజనీకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా తాము దేవస్థానం అధ్యక్షుడిగా చెప్పుకుంటే దేవదాయశాఖ చట్టం ప్రకారం శిక్షార్హులని తెలిపారు.

విధుల్లో చేరిన ఎంఈఓ

ఇల్లెందురూరల్: ఇల్లెందు ఎంఈఓగా స్వామి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం మండల నోడల్ అధికారిగా ఉన్న ఆయనకు ఎంఈఓగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇటీవల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

నేడు కుక్కలకు వ్యాక్సినేషన్

జూలూరుపాడు: స్థానిక పశువైద్యశాలలో శనివారం యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం జరగనున్నట్లు పశువైద్యాధికారి బానోత్ బద్దూలాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఉచితంగా వేయడం జరుగుతుందని, యజమానులు తమ పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలని కోరారు.

అందరికీ లాభాల వాటా చెల్లించాలి

టేకులపల్లి: సింగరేణిలోని అన్ని కేటగిరీల కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు దుబాకుల ప్రసాద్ సింగరేణి యాజమాన్యాన్ని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సులబ్, నర్సరీ, ఓబీ కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని కోరుతూ సింగరేణి డైరెక్టర్(పా) వెంకటేశ్వరరావుకి సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వెంకన్న మెమోరాండం ఇచ్చినట్లు తెలిపారు. అన్ని రకాల కాంట్రాక్ట్ కార్మికులతో పాటు సులబ్ కార్మికులు నిత్యం దుర్గంధం వెదజల్లే ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ జీవిస్తున్నారని పర్మనెంట్ కార్మికులకు, వారి కుటుంబాలకు, బస్తీలో నివసిస్తున్న ప్రజలకు సేవలు అందిస్తున్నారని, నర్సరీ కార్మికులు మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. వీరందరికీ లాభాల్లో వాటా ఇవ్వాలని కోరారు.

ఆహార పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన



మాట్లాడుతున్న జీఎం సుధాకర్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని ట్రాన్సిట్ గెస్ట్ హౌజ్, ఇల్లెందు గెస్ట్ హౌజ్‌లో శుక్రవారం జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) సామ్యేల్ సుధాకర్, సింగరేణి ప్రధానాస్పత్రి వైద్యులు కేపీఎస్ విశ్వమేధి క్యాంటీన్లలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగులకు ఆహార పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. జీఎం మాట్లాడుతూ... సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ ఆదేశాల మేరకు ఉద్యోగుల ఆరోగ్యం దృష్ట్యా సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని గెస్ట్ హౌజ్‌లు, క్లబ్‌లు, మైన్‌లలో, క్యాంటీన్లలో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ప్రతీఒక్కరు స్వచ్ఛందంగా గెస్ట్ హౌజ్, వంటగదులు, పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, డీవై పీఎం కే.శివకుమార్, గెస్ట్ హౌజ్ ఎంసీ పాసినెట్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 6 – 12 వార్డులలో రూ.4.70 కోట్ల డీఎంఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, పార్కుల నిర్మాణానికి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేనిసాంబశివరావు శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. ఇప్పటికే పూర్తయిన కొన్ని అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభలలో మాట్లాడుతూ.. ప్రజా మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. పట్టణ ప్రజల తాగునీటి సమస్యను శాశ్వత పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. మరో రూ.4.30 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కమిషనర్ శేషాంజన్‌స్వామి, తహసీల్దార్ పుల్లయ్య, ఇరిగేషన్ డీఈ రవికుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కిట్‌తో గీతకార్మికులకు మేలు



కాటమయ్య కిట్లు అందజేస్తున్న దృశ్యం

ఇల్లెందు: కల్లుగీత కార్మికులు కాటమయ్య కిట్ వాడితే సురక్షితంగా వృత్తిని కొనసాగించుకునే అవకాశం ఉందని జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఇందిర అన్నారు. శుక్రవారం ఇల్లెందులో గీత వృత్తి కార్మికులకు తాటిచెట్టు ఎక్కే సమయంలో కిట్ దరించటం వల్ల ఉపయోగాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ... గీత కార్మికులు వృత్తి రీత్యా చెట్లు ఎక్కే సమయంలో గుండెపోటు, ఫిట్స్, కాలు జారిపోవటం లాంటి సంఘటనలు జరుగుతుంటాయని, ఈ క్రమంలో ప్రమాదాలు జరిగి తీవ్రంగా నష్టపోతుంటారని తెలిపారు. ఈ తరుణంలో కాటమయ్య కిట్ వాడటం వల్ల ప్రమాదాల నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. గీత కార్మికులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ సహాయ జిల్లా అధికారి విజయలక్ష్మి, ఎక్సైజ్ ఎస్ఐ అచ్చారావు, బీసీ శాఖ ఉద్యోగి రవి, లక్ష్మణరావు, గౌడ సంఘం డైరెక్టర్లు ఉమ్మగాని హరీష్‌గౌడ్, అంజయ్య, కృష్ణ, లోకేష్‌బాబు, రాము, సత్యనారాయణ, శ్రీనివాస్, గీత కార్మికులు పాల్గొన్నారు.

టిప్పర్ అసోసియేషన్‌కు డ్రైవర్ల సమ్మె నోటీసు

ఇల్లెందు: కేటీసీ నుంచి నవభారత్, బీపీఎల్, ఇతర ప్రాంతాలకు టిప్పర్ల ద్వారా బొగ్గు సరఫరా చేస్తున్న టిప్పర్ డ్రైవర్లకు వేతనాలు పెంచటం లేదని ఇఫ్టూ ఆరోపించింది. శుక్రవారం ఇల్లెందులో టిప్పర్ అసోసియేషన్‌కు డ్రైవర్లు సమ్మె నోటీస్ అందజేశారు. ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు యాకుబ్‌షావలీ మాట్లాడుతూ... వచ్చే నెల 11 తర్వాత ఏ రోజైనా మెరుపు సమ్మెకు దిగే అవకాశం ఉందని తెలిపారు. టిప్పర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆదిత్య నర్సింహారావు, వెంకట్‌లకు సమ్మె నోటీసు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శేషయ్య, మదార్, రవీందర్, భాస్కర్, రామకోటి, నర్సింహారావు, దేవేందర్, వెంకట్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కుల నిర్మూలనకు ఐక్యంగా పోరాడుదాం..



టేకులపల్లి: మాట్లాడుతున్న గణేష్

సింగరేణి(కొత్తగూడెం): కులనిర్మూలనకై ఐక్యంగా పోరాడుదామని, భారత కార్మిక సంఘాల సమైక్య (ఇఫ్టూ) కోశాధికారి పెద్దబోయిన సతీష్ పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తగూడెంలోని రైటర్‌బస్తీలో జ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ స్థాపన 152వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సహపంక్తి భోజనాల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. ఆదిమ సమాజంలో మనుషులందరూ సమానంగా జీవించినట్లు చెప్పారు. కులనిర్మూలన పోరాటంలో కార్మికులు, కర్షకులు, యువకులు, విద్యార్థులు మహిళలు కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, కార్మికులు పాల్గొన్నారు.

టేకులపల్లి: కులనిర్మూలన అంశాలను పాఠ్యాంశాలుగా చేర్చాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మహాత్మా జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భావ దినం సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎంత అభివృద్ధి సాధిస్తున్నప్పటికీ సమాజంలో కులవివక్ష తీవ్రంగానే ఉందన్నారు. దీనికితోడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వివక్షత మరింతగా రెచ్చగొడుతోందని, నూతన విద్యా విధానం పేరుతో విద్యార్థులకు భావజాలను ఎక్కించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో భరత్, చంటి, సాయికుమార్, శ్రీజ, అనుష, రాజేశ్వరి, పూజ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సౌకర్యాలను మెరుగుపర్చండి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రధానాస్పత్రిలో సౌకర్యాలను మెరుగుపర్చాలని ఏఐటీయూసీ నాయకులు సింగరేణి అడిషినల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఉషను కోరారు. శుక్రవారం సీపీఐ బృందం ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో రోగులకు ఆశించిన విధంగా సేవలు ఉండటం లేదని, ఈ విషయంలో అధికారులు చొరవ తీసుకుని, రోగులకు సకాలంలో వైద్య సౌకర్యం, మందులు పంపిణీ చేయాలని కోరారు. వారంరోజులుగా ఆస్పత్రిలో సిటీ స్కాన్ మెషిన్, ఎలక్ట్రికల్ ప్యానెల్ బోర్డ్ పనిచేయటం లేదని వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. అదేవిధంగా క్యాజువాలిటీ, ఓపీలలో వీల్‌చైర్, స్ట్రెచర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని, నాణ్యమైన మందులు బెడ్ల వద్ద కప్‌బోర్డ్‌లను, రోగులకు డ్రెస్సులను, బెడ్‌షీట్లను సరఫరా చేయాలని, పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఏసీఎంఓ సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు.

పోరాట యోధుడు కొండా లక్ష్మణ్

స్వరాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ.. తొలి, మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిన కొండా లక్ష్మణ్ తన ఇంటిని, ఆస్తులను దానం చేశారని, స్వాతంత్ర్య పోరాటం, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఐదు దశాబ్దాలు అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందురూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు





ఇల్లెందు: నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కమిషనర్ యాదగిరి



సింగరేణి(కొత్తగూడెం): నివాళులర్పిస్తున్న ఎస్పీ



పాల్వంచ: కేటీపీఎస్‌లో నివాళులర్పిస్తున్న అధికారులు



పాల్వంచరూరల్: లక్ష్మణ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ



టేకులపల్లి: బొమ్మనపల్లి ప్రాథమిక పాఠశాలలో...

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

పాల్వంచరూరల్: స్వచ్ఛత కోసం చేసే ప్రతీ పని దేశానికి సేవ చేసినట్లేనని ఎంపీడీఓ కె.విజయ భాస్కరరెడ్డి అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధి లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే పరిశుభ్రతను అలవాటుగా మార్చుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్లాస్టిక్ కోఏకోబ్రిక్స్‌ను తయారు చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీఓ బి.నారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.నాగేశ్వరరావు, ఏపీఓ పారండ్ల రంగా, కార్యదర్శులు కృష్ణవేణి, రాంబాబు, కళాశాల సిబ్బంది గోపాలకృష్ణ, లక్ష్మీనారాయణ, రవీంద్రబాబు, సుధాకర్, అంజనాదేవి, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: ప్రతీఒక్కరికి స్వచ్ఛతపై అవగాహన ఉండాలని టేకులపల్లి ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా కోయగూడెం ఆశ్రమ పాఠశాలలో అవగాహన నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే అందరికీ ఆరోగ్యం లభిస్తుందన్నారు. భోజనం చేయడానికి ముందు, మలవిసర్జన అనంతరం చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. ఉతికిన బట్టలను ధరించాలని, ప్రతీరోజు సురక్షితమైన నీటితో స్నానం చేయాలన్నారు. బయటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని, రోజూ ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకోవాలని, వండిన ఆహార పదార్థాలపై మూతలు ఉండేలా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ జక్కుల లక్ష్మీగణేష్ గాంధీ, హెచ్ఎం అమర్‌సింగ్, వార్డెన్ నాగేశ్వర్‌రావు, కార్యదర్శి గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



టేకులపల్లి: కోయగూడెం ఆశ్రమ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



పాల్వంచరూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు